సాక్షి ఒడిశా
గురువారం । 13 । ఫిబ్రవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,33,051లు, బంగారం 6 గ్రాముల 100 మిల్లీగ్రాములు, వెండి 216 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వైభవంగా మౌళిమాత జాతర

మల్కన్‌గిరి సమితి ఛలాన్‌గూడ గ్రామం వద్ద మౌళి మాత జాతర ఘనంగా ప్రారంభమైంది. భక్తులు గిరి జన సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించారు.

- 8లో.



దుకాణంలోకి దూసుకెళ్లిన కారు

దుకాణంలోకి కారు దూసుకెళ్లిన ఘటన నయాగఢ్ ఇట్టామట్టి వద్ద బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందారు.

- 8లో.

శాసన సభలో.. డిజిటల్ శకం



సభలో సభ్యుల స్థానాల్లో సిద్ధం చేసిన ట్యాబ్‌లు

- ట్యాబ్‌లతో సభా కార్యకలాపాలు
- కాగితాలు, దస్త్రావేజులకు స్వస్తి

భువనేశ్వర్:

రాష్ట్ర శాసన సభ కాగిత రహితంగా మారనుంది. గురువారం నుంచి ప్రారంభం కానున్న శాసన సభ బడ్జెట్ సమావేశాల్లో సంప్రదాయ కాగితాలు, దస్త్రావేజులకు స్వస్తి పలకనున్నారు. వీటి స్థానంలో అధునాతన డిజిటల్ శకానికి శ్రీకారం చుడుతున్నారు. సభా కార్యకలాపాల నిర్వహణ కోసం శాసన సభ్యులకు ట్యాబ్‌ల సౌకర్యం కల్పించారు.

డిజిటలు మైలురాయి..

శాసన సభ స్పీకర్ సురమా పాఢి సమక్షంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి బుధవారం సభలో ట్యాబ్‌ల వ్యవస్థను ప్రారంభించారు. గురువారం నుంచి ప్రారంభం కానున్న సమావేశాల్లో వీటి వినియోగంతో సభా కార్యకలాపాలు కొనసాగిస్తారు. ఈ ఏడాది బడ్జెటు సమావేశాల నుంచి శాసన సభ్యులు శాసన విధుల కోసం టాబ్లెట్‌లను ఉపయోగించడంతో రాష్ట్ర శాసన సభ కాగిత రహితంగా మారనుంది. డిజిటల్ ఆవిష్కరణల దిశగా ట్యాబ్‌ల వినియోగం సభ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఈ చొరవ సభలో శాసన కార్యకలాపాలను ఆధునీకరించడం, సామర్థ్యాన్ని మెరుగుపరిచే దిశలో ముందడుగు అవుతుంది. ఈ నేపథ్యంలో సభలో 147 మంది సభ్యుల స్థానాల్లో ట్యాబ్‌లను ఏర్పాటు చేశారు. శాసన సభ్యులు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రశ్నోత్తరాల సెషన్‌లతో పాటు ఇతరేతర కార్యకలాపాల్ని కూడా ట్యాబ్‌లతో నిర్వహిస్తారు.

అఖిలపక్ష సమావేశం



స్పీకర్ సురమా పాఢి అధ్యక్షతన అఖిల పక్ష సమావేశం

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభలో బడ్జెటు సమావేశాలు పురస్కరించుకుని అఖిల పక్ష సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి శాసన సభ స్పీకర్ సురమా పాఢి అధ్యక్షత వహించారు. బడ్జెటు సమావేశాలు సందర్భంగా సభలో సామరస్య వాతావరణాన్ని పెంపొందించే ఉద్దేశంతో స్పీకరు అఖిల పక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. సభా కార్యకలాపాలను శాంతియుతంగా నిర్వహించడంలో సభ్యులు సహకరించాలని అభ్యర్థించారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి, ప్రతిపక్ష చీఫ్ విప్ మరియు ఇతరులు హాజరయ్యారు. సభా కార్యకలాపాలు సజావుగా జరిగేలా చూసేందుకు వివిధ రకాల దృక్కోణాలను ఈ సమావేశంలో చర్చించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ఈ నెల 17న సభలో ప్రవేశపెట్టనున్నారు. సమావేశాలు 28 రోజులు కొనసాగుతాయి.

గవర్నర్‌తో ముఖ్యమంత్రి భేటీ



గవర్నర్‌తో భేటీ అయిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ

భువనేశ్వర్: రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటిని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ బుధవారం కలిశారు. గురువారం నుంచి శాసన సభలో బడ్జెటు సమావేశాలు ప్రారంభం కానున్న తరుణంలో వీరివురి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా వికసిత ఒడిశా ఏర్పాటు లక్ష్య సాధనపై గవర్నర్‌తో చర్చించినట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్ర విజయాలు, భవిష్యత్తు పురోగతికి సంబంధించిన భావి ప్రణాళికపై సమగ్రంగా చర్చ కొనసాగినట్లు గవర్నరు తెలిపారు. కాగా గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా బాబు కంభంపాటి శాసన సభలో గురువారం ప్రసంగించనున్నారు.

న్యూస్‌రీల్

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి రమేష్‌చంద్ర మఝి

కొరాపుట్: గత ఏడాదిలో సంభవించిన వరదలతో నష్టపోయిన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని మాజీ మంత్రి రమేష్ చంద్ర మఝి డిమాండ్ చేశారు. నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి సమితి దలాబెడా గ్రామ పంచాయతీ బట్టపడా గ్రామాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా 2024 జూన్ 20వ తేదీన కురిసిన భారీ వర్షాలకు దుర్యోధన్ బాగ్ ఇంటి గోడ కూలి అతని నాలుగేళ్ల కుమారుడు ఫల్గుణి బాగ్ మృతి చెందాడని... అధికారులు సర్వేలు చేసి బాధిత కుటుంబానికి ప్రకృతి విపత్తుల సహాయ నిధి నుంచి పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు అయితే ఇప్పటికి ఎనిమిది నెలలు గుడుస్తున్నప్పటికీ బాధిత కుటుంబానికి పరిహారం అందలేదని రమేష్ మఝి పేర్కొన్నారు. తక్షణం పరిహారం అందజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వివాహిత మృతి కేసులో ముగ్గురి అరెస్టు



అరెస్టయిన భర్త, అత్తమామలు

రాయగడ: వరకట్నం వేధింపులతో తమ కుమార్తెను హత్య చేశారంటూ తండ్రి గుణుపూర్ ఆదర్శ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం ముగ్గురిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో చంద్రపూర్ గ్రామానికి చెందిన మృతురాలి భర్త దేవాశీష్ మాఝి, మామయ్య శరత్‌కుమార్ మాఝి, అత్తయ్య చంద్రమ బిషొయి ఉన్నారు. గుణుపూర్ పట్టణంలోని గణేష్‌నగర్‌లో నివసిస్తున్న రస్మీరంజని బొడొకుమార్ అనే వివాహిత ఈ నెల 9న అనుమానాస్పదంగా మృతి చెందింది. దీనిపై మృతురాలి తండ్రి కుంజొబిహారి బొడొకుమార్ గుణుపూర్ ఆదర్శ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు మృతురాలి భర్త, అత్త, మామయ్యలను అదుపులోకి తీసుకున్నారు.

అత్యాచారం కేసులో నిందితుడు అరెస్టు



అరెస్టయిన ప్రఫుల కుమార్ సెలి

జయపురం: మహిళలపై అత్యాచారం జరిపాడన్న నేరారోపణతో జయపురం సదర్ పోలీసులు జయపురం పంచబటీ నగర్ ప్రఫుల కుమార్ సెలిని అరెస్టు చేసినట్టు సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి బుధవారం వెల్లడించారు. జయపురం సదర్ పోలీసు స్టేషన్ అంబాగుడ పోలీసు పంటి పరిధికి చెందిన ఓ మహిళ తనపై అత్యాచారం జరిగిందని ఈ నెల పదో తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి నిందితుడుని అరెస్టు చేశామన్నారు.

బాలికను మోసగించిన యువకుడు అరెస్టు

మల్కన్‌గిరి : జిల్లా కోరుకొండ సమితి పరిధిలో 16 ఏళ్ల బాలికను మోసం చేసి లైంగికదాడికి పాల్పడిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. మల్కన్‌గిరి జిల్లా కేంద్రం సమీపంలోని నువగూఢ గ్రామానికి చెందిన అమన్ కాఛిమ్ కోరుకొండ సమితికి చెందిన 16 ఏళ్ల బాలికతో పరిచయం పెంచుకుని మోసం చేశారు. బాలిక గర్భం దాల్చిన విషయం గుర్తించిన తల్లి బలిమెల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు బుధవారం యువకుడిని అరెస్టు చేశారు. వైద్య పరీక్షల అనంతరం నిందితుడిని కోర్టుకు తరలిస్తామని ఐఐసీ ధీరాజ్ తెలిపారు. బాలికను జిల్లా చైల్డ్‌లైన్ అధికారులకు అప్పగిస్తామని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ర్యాలీ చేస్తున్న మహిళలు

మల్కన్‌గిరి: సమస్యలు పరిష్కరించాలని జీవికా మిషన్, మిషన్ శక్తి సభ్యులు డిమాండ్ చేశారు. ఈసీ సభ్యుల రీస్ట్రక్చరింగ్ నిలిపివేయాలని, స్థిర నియామకం చేయడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి పేరున రాసిన వినతిని జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్‌కు బుధవారం అందజేశారు. అంతకుముందు మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు.

మావోయిస్టుల పేరిట నకిలీ లేఖలు



మావోయిస్టుల పేరిట బ్యానర్



వంతెనపై అతికించిన పత్రాలు

కొరాపుట్: మావోయిస్టుల పేరిట నకిలీ లేఖలు కలకలం సృష్టించాయి. బుధవారం కొరాపుట్ జిల్లా నారాయణపట్న సమితి తెంతులి పాదర్ గ్రామ పంచాయతీ కుముడసీల్, డొంగాపాయి గ్రామాల మధ్య వంతెన వద్ద ఇవి కనిపించాయి. సీపీఐ మావోయిస్టు పార్టీ పేరిట కొన్ని గోడ ప్రతులు, బ్యానర్లు ఉండటాన్ని గిరిజనులు గుర్తించారు. ఆ ప్రాంతంలో రెండు వర్గాల మధ్య భూ విభేదాలపైనా హెచ్చరికలు చేశారు. అయితే ఈ లేఖల శైలి పరిశీలిస్తే మావోయిస్టు భావజాలం కనిపించకపోవడంతో నకిలీవిగా నారాయణ పట్న పోలీసులు చెబుతున్నారు. సుమారు నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టుల ప్రభావం కొనసాగిన ఈ ప్రాంతంలో ఐదేళ్లుగా వారి జాడ లేదు.

వ్యాధుల నుంచి ప్రజలను కాపాడాలి

- ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



సమావేశంలో ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి తదితరులు

జయపురం: డెంగీ, మలేరియా తదితర వ్యాధుల నుంచి గ్రామీణ ప్రజలను కాపాడడంతోపాటు వారిలో చైతన్యం తీసుకురావాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అభిప్రాయపడ్డారు. జయపురం సమితి రమణగుడలోని కమ్యూనిటీ ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన రోగి కళ్యాణ సమితి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేటట్లు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో మలేరియా జ్వరాలు విస్తరిస్తున్న నేపథ్యంలో నివారం చర్యల్లో భాగంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. గత నాలుగేళ్ల నుంచి ప్రజలకు దోమతెరలు సరఫరా చేయడం లేదని.. ఈసారైనా సరఫరా చేయాలని బాహిణీపతి సూచించారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని, అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవసరమైన మందులతో పాటు టీటీ ఇంజక్షన్‌లు ఉంచాలన్నారు. పిల్లల ఆరోగ్యంపై డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రతి గ్రామానికి సంచార వైద్య వాహనాన్ని పంపించాలన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. కాగా ఈ ఏడాది 81 వేల మందికి మందుతో కూడిన దోమతెరలు పంపిణీ చేయాలని నిర్ణయించిందని సమావేశంలో జయపురం సమితి అధ్యక్షురాలు తిలోత్తమ ముదులి, ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ శ్వస్తిక్ మహల్ వెల్లడించారు. సమావేశంలో బీపీఎం దీపాన్విత పట్నాయక్, బీఏఎం హిమాంశు మిశ్ర, ప్రజా వైద్యాధికారి ధరిత్రీ ముదులి, సీడీపీవో కంజన పండ, ఏబీఈవో ప్రియంబిత పాత్రో, సమితి సభ్యులు కును గౌడ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఊరేగింపు



పర్లాకిమిడి పట్టణ శివారులో ఉన్న మాశ్యామ కాళీదేవిని మాఘపౌర్ణమి సందర్భంగా బుధవారం తిరువీధిగా ఊరేగించారు. భక్తులు కాళీమాతను దర్శించుకుని కానుకలు, బియ్యం అందజేశారు. జగన్నాథ మందిరం, అభయాంజనేయ స్వామి మందిరంలో అన్నప్రసాదాలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

– పర్లాకిమిడి

ఉపనిషత్తులు, విద్యావ్యవస్థను కాపాడుకోవాలి



హాజరైన ప్రొఫెసర్, అధ్యాపకులు

- జాతీయ సెమినార్‌లో వక్తలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జితేంద్రనాథ్ పట్నాయక్



ప్రసంగిస్తున్న కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుమంత బెహరా

పర్లాకిమిడి: ఉపనిషత్తులు, విద్యావ్యవస్థను కాపాడుకోవాలని వక్తలు అన్నారు. స్థానిక క్రిష్ణచంద్ర గజపతి కళాశాలలో భారతీయ జ్ఞాన పరంపరపై జరుగుతున్న జాతీయ సెమినార్‌లో భాగంగా రెండో రోజైన బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ జితేంద్ర నాథ్‌పట్నాయక్, నార్త్ ఈస్టర్న్ హిల్ యూనివర్సిటీ (షిల్లాంగ్) ప్రొఫెసర్ అంబికా ప్రసాద్ పతి, అసిస్టెంటు ఫిజిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ పరమానంద జెన్నా, ప్రొఫెసర్ సుమంత్‌బెహెరా, ఇందిరాగాంధీ జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం, (మధ్యప్రదేశ్) కామర్స్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి డాక్టర్ ఎస్.కె. బరాల్, ప్రొఫెసర్ మహమ్మద్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు. రెండవ సెషన్‌లో మన ఉపనిషత్తులు, విద్యావ్యవస్థలో సమీకృత సంప్రదాయ భారతీయ విజ్ఞానం, వాతావరణ మార్పులు, కోందు గిరిజనుల కోయి భాషాపై నూతన విద్యావిధానం ప్రభావం, వికసిత్ భారత్ శిక్షా పద్ధతిలో ఒడిశా ఆదివాసీ భాష ఉనికి వంటి టెక్నికల్ పేపర్లను డాక్టర్ బిరాజ్ క్రిష్ణ మిశ్రా, లలితీ కన్వర్, ప్రదిప్తకుమార్ షడంగి, డాక్టర్ అమిరేష్ సేనాపతి, ప్రదీప్ కుమార్ నాయక్, బిష్ణుచరణ్ మల్లిక్, భారతీయ శిక్షా వికాసం, గోపబంధు దాస్ భూమికపై సంజులత మాట్లాడారు. పలు రాష్ట్రాల నుంచి హాజరైన విద్యావేత్తలు, ప్రొఫెసర్లు పలు విషయాలపై చర్చించారు.

ఆశా వర్కర్ల సేవలు వెలకట్టలేనివి



ఉత్తమ సేవలందిస్తున్న ఆశా వర్కర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: గ్రామీణ ప్రాంతాల్లో ఆశా వర్కర్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. బుధవారం జయపురం సమితి రామణగుడ కమ్యూనిటీ ఆస్పత్రి ప్రాంగణంలో ఉత్తమ ఆశా వర్కర్లకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు ఉత్తమ సేవలందించిన బరిణిపుట్ ఆశావర్కర్ భవాణి పూజారి, కుడప ఆశావర్కర్ దేబపతి నాయిక్, ధనపూర్ ఆశావర్కర్ ప్రతిమ పంగి, హడియ ఆశావర్కర్ సుధాంశు బాల, పూజారిపుట్ ఆశా వర్కర్ గోమతి మహురియ, కొంగ ఆశావర్కర్ ఉషా హరిజన్, ఎకంబా పంచాయితీ ఆశావర్కర్ మమత మిశ్రాలకు సన్మానం చేసి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ స్వస్తిక్ మహల, డాక్టర్ అభిషేక్ కుంభార్, డాక్టర్ శామిత్ర దొలాయి, ప్రజారోగ్య విస్తరణ అధికారి ధరిత్రి ముదులి, డీపీఎం దీపాన్విత పట్నాయిక్, సూపర్‌వైజర్ సుశాంత నాయిక్, సమితి అకౌంటెంటెంట్ మేనేజర్ హిమాంశు మిశ్రా, జయపురం సమితి కాంగ్రెస్ అధ్యక్షుడు బసంత నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక



ఎంపిక పోటీలకు హాజరైన క్రీడా జట్లు

జయపురం: ఒడిశా క్రికెట్ అసోసియేషన్ ఆదేశాల మేరకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-19 జట్టుకు క్రీడాకారుల ఎంపిక పోటీలను బుధవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 60 మంది పాల్గొన్నారు. వీరిని నాలుగు జట్లుగా విభజించి పోటీలు నిర్వహించారు. జయపురం సబ్‌డివిజన్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రబి నాయిక్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. జట్లకు రెడ్, గ్రీన్, ఎల్లో, బ్లూ పేర్లను పెట్టారు. ప్రారంభ పోటీలలో స్థానిక విక్రమ క్రీడా మైదానంలో జరిగిన పోటల్లో ఎల్లో, బ్లూ టీమ్‌లు తలపడ్డాయి. ఎల్లో టీమ్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన బ్లూ టీమ్ 40 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 278 పరుగులు చేసింది. 279 పరుగుల లక్ష్యంతో బ్యాడింగ్‌కు దిగిన ఎల్లో టీమ్ 27 ఓవర్లలో కేవలం 118 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. దీంతో బ్లూ టీమ్ 160 పరుగులతో విజయాన్ని దక్కించుకుంది. రెండో మ్యాచ్ స్థానిక విక్రమదేవ్ విశ్వ విద్యాలయ క్రీడా మైదానంలో జరిగింది. ఈ పోటీలో రెడ్, గ్రీన్ టీమ్‌లు తలపడ్డాయి. రెడ్ టీమ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 35 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 333 పరుగులు చేసింది. 334 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన గ్రీన్ టీమ్ 31 ఓవర్లలో అన్ని వికెట్లు పోగొట్టుకుని కేవలం 232 పరుగులు మాత్రమే చేయగలిగింది. రెడ్ టీమ్ 202 పరుగులతో విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్ తరువాత సమర్థులైన ఆటగాళ్లను ఒడిశా క్రికెట్ అసోసియేషన్‌కు ఎంపిక చేస్తామని రబి నాయిక్ వెల్లడించారు.

క్లుప్తంగా

వేధిస్తున్న వ్యాక్సిన్ల కొరత



చిన్నారులకు వ్యాక్సిన్లు వేస్తున్న సిబ్బంది

టెక్కలి రూరల్: స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చిన్నారులకు వేసే వ్యాక్సిన్ల కొరత వేధిస్తోంది. ప్రధానంగా 6, 10, 14 నెలల చిన్నారులకు వేయాల్సిన ఐపీవీ, బీసీజీ, పెంటావాలంట్, ఓపీవీ వ్యాక్సిన్ల కొరతతో తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న అరకొర వ్యాక్సిన్లతోనే సిబ్బంది కొంతమేర సేవలందిస్తున్నారు. అందువలన అధికారులు చర్యలు తీసుకొని, పూర్తిస్థాయిలో వ్యాక్సిన్లు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

వరుస దొంగతనాలతో ఆందోళన

కంచిలి: మండలంలో ఇటీవల వరుస దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తాజాగా మంగళవారం రాత్రి కంచిలి ఏపీజీవీబీ శాఖ ఎదురుగా మేడమీద అద్దె ఇంట్లో నివాసముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు త్రిలోచన పాల్లాయికి చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. వివరాల్లోకి వెళ్తే.. త్రిలోచన పాల్లయి ఎప్పటిలాగే మంగళవారం రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఏపీజీవీబీ బ్రాంచ్ ముందు భాగంలో పార్క్ చేశాడు. అయితే ఉదయం లేచి చూసేసరికి లేకపోవడంతో లబోదిబోమన్నాడు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా ఈ మధ్యకాలంలో మరో మూడు బైక్‌లు చోరీకి గురయ్యాయి. దీంతో బాధితులంతా ఏం జరిగిందో అర్థం కావడం లేదని వాపోతున్నారు. మరోవైపు ఆదివారం సంత ప్రాంతంలో ప్రతి వారం సంత జరిగే సమయాల్లో సెల్‌ఫోన్లు ఎక్కువగా చోరీకి గురవుతున్నాయి. దీంతో పోలీసులు ఈ ఘటనలపై ప్రత్యేక దృష్టి సారించి దొంగలను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సహాయకులపై చిన్నచూపు

- కిడ్నీరోగితో వచ్చేవారికి సదుపాయాలు కరువు



కుర్చీపై కిక్కిరిసి కూర్చున్న కిడ్నీ రోగులు, సహాయకులు



సహాయకుల వద్ద పనిచేయని ఫ్యాన్

కాశీబుగ్గ: పలాసలో ప్రభుత్వ కిడ్నీ పరిశోధన కేంద్రం, డయాలసిస్ యూనిట్ వద్ద డయాలసిస్ కోసం వచ్చిన కిడ్నీ రోగులకు, వారి సహాయకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ షిఫ్టులలో డయాలసిస్ సేవల కోసం వస్తున్నవారికి కనీస మౌలిక సదుపాయాలు అందడం లేదు. డయాలసిస్ పూర్తవ్వడానికి సుమారు నాలుగు గంటల సమయం పడుతున్న తరుణంలో, రోగితో వచ్చిన సహాయకులకు కనీసం కుర్చీలు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. దీంతో కిందనే కూర్చున్నవారు కొందరైతే, మరికొందరు డయాలసిస్ పూర్తయ్యేవరకు నిలబడే ఉంటున్నారు. ఈ డయాలసిస్ యూనిట్‌ను నెఫ్రోప్లస్ సంస్థ వారు నడుపుతున్నారు. ఇక్కడ 3 షిఫ్టులలో రోజుకు 86 మందికి డయాలసిస్ చేస్తున్నారు. రోజుకు రోగులు, వారి సహాయకులు సుమారు 180 నుంచి 200 మంది వరకు వస్తుంటారు. దీంతో అటువంటి వారికి ఇక్కడ సౌకర్యాలు కల్పించాలని వారంతా డిమాండ్ చేస్తున్నారు.

వెయిట్‌లిఫ్టర్ ధనుంజయ మృతి



వెయిట్ లిఫ్టింగ్ చేస్తున్న ధనుంజయ(ఫైల్)

నందిగాం: మండలంలోని శివరాంపురం గ్రామానికి చెందిన వెయిట్‌లిఫ్టర్ ఇప్పిలి ధనుంజయ(44) అనారోగ్యంతో బుధవారం వేకువజామున మృతి చెందాడు. గత కొద్ది రోజులుగా ఆయన కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. జిల్లాస్థాయిలో జరిగే సంగిడి రాళ్లు, ఉలవల బస్తాలు ఎత్తే పోటీల్లో, వెయిట్ లిఫ్టింగ్‌లో అనేక బహుమతులు అందుకున్నారు. ధనుంజయ మొదటి భార్య శార్వాణి క్యాన్సర్‌తో మృతి చెందగా, లక్ష్మీ అనే మరో మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. అతడికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన మృతిపై గ్రామస్తులు, పలువురు క్రీడాకారులు సంతాపం వ్యక్తం చేశారు. అంతిమ యాత్రలో నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కురమాన బాలకృష్ణారావు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు చిన్నిజోగారావు, అంబోడి విష్ణు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

వైభవంగా మౌళిమాత జాతర



పూజలందుకుంటున్న అమ్మవారు



ఆలయం వద్ద అమ్మవారు

మల్కన్‌గిరి సమితి ఛలాన్‌గూడ గ్రామం వద్ద మౌళి మాత జాతర ఘనంగా ప్రారంభమైంది. బుధవారం మాఘ పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకకు మూడు పంచాయతీల పరిధిలోని 55 గ్రామాలకు చెందిన భక్తులు లాఠీలు (ఘటాలు) పట్టుకుని గిరిజన సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించారు. నూవగూడ పురోహితులు పుష్పక విమానంలో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చి మందిరం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు స్థానికులతో పాటు ఛత్తీస్‌గఢ్ నుంచి భారీగా భక్తులు తరలివస్తున్నారు.

– మల్కన్‌గిరి



మందిరాల నుంచి తీసుకొచ్చిన లాఠీలు (ఘటాలు)



ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు





నృత్యం చేస్తున్న భక్తులు

బియ్యం అక్రమ రవాణా అడ్డగింత



పీడీఎస్ బియ్యంతో పట్టుబడిన లారీ

పర్లాకిమిడి: పేదలకు అందాల్సిన పీడీఎస్ బియ్యం పర్లాకిమిడి నుంచి పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తుండగా పోలీసులు, స్థానికులు అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేశారు. రాణిపేట రోడ్డులో సీతారాం ఫైర్‌వర్క్స్ గోదాంలో 250 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పక్క రాష్ట్రానికి తరలిస్తుండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంబంధిత అధికారులు, పోలీసుల సహాయంతో రెల్లివీధి వద్దకు చేరుకొని బియ్యాన్ని తరలిస్తున్న లారీని అడ్డుకున్నారు. లారీ డ్రైవర్ వద్ద సరైన ఆధారులు, పర్మిషన్, వేబిల్లు లేకపోవడంతో పర్లాకిమిడి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అయితే బియ్యం ట్రక్కు పట్టుకుని రెండు రోజులు గడిచినా తగు చర్యలు చేపట్టలేదు. ఈ విషయమై సబ్ కలెక్టర్, పౌరసరఫరాల శాఖ ఇన్‌చార్జి అనుప్ పండాను ప్రశ్నించగా..అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న సమాచారం అందిందని, వెంటనే సంబంధిత అధికారులు చేరుకుని పరిశీలించారన్నారు. సరైన ఆధారాలు లేకపోతే చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనిపై బీజేపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావు స్పందిస్తూ బీజేడీ పార్టీ నాయకులు కొందరు అధికారుల అండదండలతో పీడీఎస్ బియ్యాన్ని పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, ముఖ్యమంత్రి మోహన్ మఝికి ఫిర్యాదు చేస్తానని అన్నారు.

నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

- ప్రభుత్వంపై దాడికి ప్రతిపక్షాలు సిద్ధం

భువనేశ్వర్: శాసనసభలో బడ్జెట్ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. ప్రధాన ప్రతిపక్షమైన బిజూ జనతా దళ్ రాష్ట్రంలో కుప్పకూలిన శాంతిభద్రతల వ్యవస్థకు ప్రభుత్వాన్ని పూచీదారుగా సభలో నిలదీసేందుకు సమాయత్తమైంది. వరి కొనుగోలు పురస్కరించుకుని మండీల్లో అక్రమాలపై బీజేడీ అధికార పక్షాన్ని నిలదీసేందుకు సిద్ధమైంది. పూరీ జిల్లా కొణాస్ మండలంలో అతిసార వ్యాప్తి, అమాయకుల మృత్యు ఘటన ఆధారంగా ప్రభుత్వం వైఫల్యాలపై విపక్షాల దాడితో సభ దద్దరిల్లనుంది. మరెన్నో అంశాల్ని ప్రభుత్వ వైఫల్యాలుగా పేర్కొని ఉద్యమించేందుకు విపక్షాలు కత్తులు నూరుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ 8 నెలల వైఫల్యం తర్వాత బిజూ జనతా దళ్ ప్రధాన అంశాలను లేవనెత్తడం ద్వారా సభలో ప్రభుత్వాన్ని ఘెరావ్ చేస్తుంది. ఎన్నికల వాగ్దానాల వైఫల్యంపై కాంగ్రెస్ పదునైన దాడిని ప్రారంభిస్తుంది.

శాసన సభ బడ్జెట్ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభమై 28 పని దినాలతో సుదీర్ఘంగా కొనసాగాల్సి ఉంది. ప్రధాన ప్రతిపక్షమైన బీజేడీ అధికార పక్షంపై దాడికి పూర్తిగా సిద్ధంగా ఉంది. రాష్ట్ర ప్రజల సమస్యలు ప్రధాన శీర్షికగా సభలో బీజేడీ పలు ప్రస్తావనల్ని లేవనెత్తుతుందని బీజేడీ



మాట్లాడుతున్న డాక్టర్ ప్రసన్న ఆచార్య

నాయకుడు ప్రసన్న ఆచార్య తెలిపారు. ప్రతిపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్ అధ్యక్షతన స్థానిక శంఖభవన్‌లో బీజేడీ శాసన సభా పక్ష సమావేశం బుధవారం జరిగింది. అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వ పాలన అధోముఖంగా కొనసాగుతుందని ఆరోపించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. ఎన్నికల హామీల్ని అమలు చేయలేని దయనీయ స్థితిలో ప్రభుత్వం తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. రాజధాని నగరంలో తరచూ హత్యలు, ప్రముఖులు ఉంటున్న ప్రాంతాల్లో నిత్యం దొంగతనాలు, దోపిడీలు, నాయకులకు హత్య బెదిరింపులు వంటి సంఘటనలపై నిలదీస్తామన్నారు. వివిధ శాఖల మధ్య సమన్వయ లోపంతో అవకతవకలు తలెత్తుతున్నాయని, పూరీ జిల్లా కొణాస్ మండలంలో అతిసార సోకడం, బారాబటి స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల లోపం వంటి అంశాలను బీజేడీ రాష్ట్ర ప్రజల గళమై ప్రతిధ్వనింపజేస్తుందన్నారు.

మొరాయిస్తున్న డబల్ ఇంజను సర్కారు..

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన 24 గంటల్లోనే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం చిట్ ఫండ్ డబ్బును తిరిగి చెల్లించడం, 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం, అలవెన్సులు పెంచడం, సుభద్ర యోజన కింద రెండేళ్లలో మహిళలందరికీ రూ. 50,000 ఇవ్వడం వంటి ఎన్నికల హామీలను మరచిపోయిందని, రాష్ట్రంలో సర్కారు డబల్ ఇంజిన్లు మొరాయిస్తున్నాయని కాంగ్రెస్ వర్గం ఆరోపించింది. మంత్రులపై ప్రభుత్వానికి నియంత్రణ లేదని, విస్మరించిన ఎన్నికల హామీల అమలు, కార్యాచరణ అంశాల్ని కాంగ్రెసు సభ్యులు బడ్జెట్ సమావేశంలో ప్రభుత్వాన్ని ఘెరావ్ చేసేందుకు ఒక వ్యూహాన్ని రూపొందించినట్లు పేర్కొంది. కాగా, ఈ నెల 13న గవర్నర్ ప్రసంగంతో సభా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను 17న ప్రవేశపెట్టనున్నారు. సమగ్రంగా 28 పని దినాలతో బడ్జెట్ సమావేశాల షెడ్యూలు ఖరారైంది.

నిందితుడు అరెస్ట్



పూర్ణిమ మృతదేహం



నిందితుడు రవిని అరెస్ట్ చేసిన పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లా బలిమెల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఓ యువతి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. నీలిమారిలో నివసం ఉంటున్న పూర్ణిమ నాయక్ (20) అనే సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో ఎంతో ఆనందంగా గడిపింది. అందరూ నిద్రపోయిన తరువాత అర్థ రాత్రి సమయంలో విషం తాగింది. తల్లి లేచి చూసే సరికి పూర్ణిమ కడుపు నొప్పితో ఇబ్బంది పడుతుండటంతో వెంటనే ఇతర కుటుంబ సభ్యులకు విషయం తెలిపింది. బలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు మల్కన్‌గిరి తీసుకువెళ్లాలని సూచించారు. అక్కడ నుంచి మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి పూర్ణిమ మృతి చెందింది. ఆమె సోదరుడు లైచన్ నాయక్ బల్మెల పోలీసు స్టేషన్‌లో బుధవారం ఫిర్యాధు చేశాడు. తన సోదరి ఆత్మహత్యకు దనీగూడ గ్రామానికి చెందిన రవి (24) కారణమని ఫిర్యాదులో పేర్కొన్నారు. బలిమెల పోలీసులు రవిని పట్టుకుని విచారించారు. ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు. అందువల్లే పూర్ణిమ విషం తాగినట్లు రుజువైంది. రవిని అరెస్ట్ చేసి కేసు నమోద్ చేసినట్లు బలిమెల ఐఐసీ ధీరాజ్ పట్నాయక్ తెలిపారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన కారు

- ఇద్దరు దుర్మరణం
- పరారీలో డ్రైవర్



ప్రమాదంలో నుజ్జయిన కారు

భువనేశ్వర్: దుకాణంలోకి కారు దూసుకెళ్లిన ఘటన నయాగఢ్ ఇట్మామట్టి వద్ద బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు. మృతుల్లో కారు యజమాని ఒకరుగా గుర్తించారు. మరో మృతుడి ఆచూకీ తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మహీంద్రా ఎస్‌యూవీ కారు వేగంగా దూసుకుపోతూ నియంత్రణ కోల్పోయి రహదారి పక్కనే ఉన్న ఎలక్ట్రానిక్స్ దుకాణాన్ని ఢీకొట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. వాహనం వేగం ధాటికి దుకాణం కాంక్రీట్ స్తంభాలలో ఒకటి కుప్పకూలిపోయింది. కారు పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. సమీపంలో పార్క్ చేసిన వాహనాన్ని ఢీకొని ముందుకు దూసుకు పోవడంతో దుకాణం ముందు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మరణించాడు. ఇట్మామట్టి ఠాణా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం మృతి చెందిన కారు యజమాని ఖుర్దా జిల్లా సాగరుగాంవ్ గ్రామస్తుడిగా చెబుతున్నారు.

స్కై వ్యవసాయ కళాశాలకు ఐకార్ గుర్తింపు



ఐకార్ గుర్తింపు ధ్రువీకరణ పత్రం చూపిస్తున్న డైరెక్టర్ శ్రీరాంమూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఎస్ఎస్ఆర్‌పురంలో వికాస్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కై వ్యవసాయ కళాశాలకు ఐకార్ (ఇండియాన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్) గుర్తింపు లభించినట్లు వికాస్ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ బుడుమూరు శ్రీరాంమూర్తి తెలియజేశారు. ఈ మేరకు కళాశాలలో విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. 2016లో ఏర్పాటు చేసిన ఈ కళాశాల నుంచి ఇప్పటివరకు ఐదు బ్యాచ్‌ల విద్యార్థులు రిలీవ్ అయ్యారన్నారు. ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఏజీ బీఎస్సీలో 70 మందికి ప్రవేశాలు కలిపిస్తున్నామని, ఇకపై 156 మందికి ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలియజేశారు. రెండేళ్ల వ్యవసాయ డిప్లొమోలో 40 సీట్లు ఉన్నాయన్నారు. ఏజీ బీఎస్సీ, డిప్లొమో పూర్తిచేసిన విద్యార్థులకు అనేక రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నట్లు చెప్పారు. ఐకార్ గుర్తింపు వలన విద్యార్థులకు మరింత మెరుగైన ప్రమాణాలతో కూడిన విద్య అందుతుందని చెప్పారు. సమావేశంలో అసోసియేట్ డీన్ మోష, మేనేజ్‌మెంట్ సభ్యుడు బి.రఘుకార్తీక్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రావణి, రాజారుషి పాల్గొన్నారు.


ఆటోను ఢీకొట్టిన కారు



ప్రమాద స్థలంలో ఉన్న కారు

మల్కన్‌గిరి: జిల్లా బలిమెల చౌక్ వద్ద శివలాయం సమీపంలో బలిమెల–జయపూరం ముఖ్య రహదారిపై జయపురం నుంచి వస్తున్న కారు అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఆ సమయంలో ఆటోలో ఉన్న వ్యక్తికి తీవ్రంగా గయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి 108కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడిని మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న 5 అడుగుల లోతులో ఉన్న పొలంలోకి పడింది. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. కారులో డ్రైవర్, మరో మహిళ ఉన్నారు. కారు యజమాని రాకేష్ పాత్రోను, ఆటో డ్రైవర్ గోపాల్ మాఝిను బలిమెల పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కారును జేసీబీ సాయంతో బయటకు తీశారు.

ట్రక్కు బోల్తా



సంఘటన ప్రదేశంలో ఉన్న ట్రక్కు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి లొంగలపకన ఘాట్‌పై నుంచి ట్రక్కు బోల్తా పడింది. డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఝూర్సుగుడ నుంచి ట్రక్కు అల్యూమినియం పైపుల లోడుతో విజయవాడ–రాంచీ 326 జాతీయ రహదారిలో తమిళనాడు వెళ్తుండగా బుధవారం ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న బొయిపరిగుడ ఎస్ఐ శివశంకర నాయక్ నేతృత్వంలో పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకున్నారు. గాయపడిన డ్రైవర్‌ను బొయిపరిగుడ ప్రభుత్వ కమ్యూనిటీ హాస్పిటల్‌కు తరలించారు. డ్రైవర్ తలపై బలమైన గాయమైందని, చేతులకు బలమైన దెబ్బలు తగిలాయన్నారు. స్టీరింగ్ గుండెకు బలంగా హత్తుకోవటంతో మెరుగైన వైద్యం కోసం జయపురం జిల్లా కేంద్ర హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. ఎస్ఐ శివశంకర నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గజేంద్రమోక్షం అవతారంలో జగన్నాథుడు



గజేంద్రమోక్షం అవతారంలో జగన్నాథుడు



ప్రత్యేక అలంకరణలో బలభద్ర, సుభద్రలు

పర్లాకిమిడి: మాఘ పౌర్ణమి, సంక్రాంతి సందర్భంగా జగన్నాథుడు బుధవారం గజేంద్ర మోక్షం అవతారంలో భక్తులకు కనువిందు చేశాడు. మాఘమాసం పౌర్ణమి నాడు అడవిలో వున్న ఏనుగును మొసలి పట్టుకున్నప్పుడు నారాయణుడ్ని వేడుకోనగా ఆయన వచ్చి నీటిలో వున్న మొసల్ని వధించిన వృత్తాంతం గజేంద్ర మోక్షం. మాఘపౌర్ణమి సందర్భంగా మహిళలు వేంకటేశ్వరుని ఆలయంలో ప్రత్యేక దీపారాధన చేశారు. పలువురు సముద్రస్నానం ఆచరించి ఆలయాలను సందర్శించారు. సాయంత్రం ప్రత్యేక దీపారాధన చేశారు.

సమస్యలు పరిష్కరించేవారికే మద్దతు



మాట్లాడుతున్న దుగ్గివలస రాంప్రసాద్

పొందూరు: రాష్ట్రంలోని కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేసే ఎమ్మెల్సీ అభ్యర్థులకే తమ మద్దతు ఉంటుందని కాంట్రాక్స్ లెక్చరర్స్ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి దుగ్గివలస రాంప్రసాద్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలనుద్దేశించి మాట్లాడారు. 25 ఏళ్ల తమ సుదీర్ఘ సర్వీసుల ప్రస్థానంలో ఎటువంటి ఉద్యోగ భద్రతకు నోచుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ విషయంలో పాలకులు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. గత ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ చట్టం యాక్ట్ నంబర్ 30/2023 ప్రకారం, జీవో నంబర్ 114 అనుసరించి సర్వీసుల క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తిచేసినప్పటికీ, నియామక ఉత్తర్వుల జారీకి ఎన్నికల కోడ్ అడ్డంకిగా నిలిచిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు గడిచినప్పటికీ క్రమబద్ధీకరణ ఉత్తర్వుల విషయంలో స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంలో ప్రభుత్వంతో చర్చించేందుకు చిత్తశుద్ధి కలిగిన అభ్యర్థికే తాము అండగా నిలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్లు డాక్టర్ అచ్యుతరావు, పాట్నూరు రమేష్, శ్రీనివాసారావు, దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో పతకం



పతకంతో విజేత ప్రవీణ్‌కుమార్

విజయనగరం అర్బన్: శ్రీకాకుళంలో ఇటీవల జరిగిన 30వ మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ చాంపియన్ షిప్–2025 రాష్ట్రస్థాయి పోటీల్లో విజయనగరం పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు ఎ.ప్రవీణ్‌కుమార్ పతకం సాధించారు. 50వ సంవత్సరాలు పైబడిన కేటగిరిలో ఈ పతకం లభించిందని బుధవారం ప్రవీణ్‌కుమార్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. గుర్ల మండలం వల్లాపురం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన ఇంతవరకు వివిధ విభాగాల్లో జిల్లా, రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో పలు పతకాలు సాధించారు.

కాలువలో పడి వ్యక్తి మృతి



రామకృష్ణ మృతదేహం

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ సమీపంలోని మురుగుకాలువలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. బుధవారం ఉదయం కాలువలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం మృతుని బంధువులకు తెలియడంతో వారు వచ్చి పరిశీలించి మెరకముడిదాం మండలం రామయ్యవలస గ్రామానికి చెందిన మజ్జి రామకృష్ణ (35)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రామకృష్ణ విశాఖపట్నంలో టిఫిన్ షాపులో పనిచేస్తున్నాడు. మృతుని తండ్రి అనారోగ్యంతో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో చూడడానికి వెళ్లేందుకు ద్విచక్రవానంపై ఈ నెల 7న రాజాం బస్టాండ్‌కు చేరుకుని ద్విచక్రవాహనం పార్కు చేశాడు. ఈ నెల 11న రాత్రి 8గంటలకు ఇంటికి వస్తానని భార్యతో చెప్పాడు. రామకృష్ణ మృతిచెందిన విషయం వివిధ మాధ్యమాల్లో ప్రచారమైన విషయాన్ని మృతుని భార్య వరలక్ష్మి, కుటుంబసభ్యులకు గ్రామానికి చెందిన నూకరాజు సమాచారం అందించాడు. దీంతో వారు రాజాం చేరుకుని మృతదేహాన్ని గుర్తించి భోరున విలపించారు. మద్యం మత్తులో ప్రమాదవశాత్తు కాలువలో పడి తన భర్త మృతిచెందాడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



శ్రీరాములు మృతదేహం

వంగర: మండల పరిధి పాతమరువాడ సమీపంలోని టేకు తోటలో మెరముడిదాం గ్రామానికి చెందిన వసాది శ్రీరాములు(55) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు హెచ్‌సీ నీలాం శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయ న మాట్లాడుతూ వసాది శ్రీరాములు వంగర మండలంలోని చొదరివలస బంధువుల ఇంటి కి వచ్చి తిరిగివెళ్లాడని, మార్గమధ్యంలో పాతమరువాడ పెరుమాళి తిరుపతిరావుకు చెందిన టేకుతోటలో ఉరివేసుకుని మృతిచెందిన విషయంపై సమాచారం అందిందని చెప్పారు. దీంతో రేగిడి ఎస్సై లీలావతి సంఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలించారన్నారు. నిత్యం మద్యం మత్తులో ఉంటాడని, మద్యానికి బానిసకావడంతో మృతిచెందినట్లు మృతుడి భార్య చిన్నమ్మడు ఫిర్యాదు చేసినట్లు హెచ్‌సీ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మృతదేహాన్ని రాజాం సీహెచ్‌సీకి తరలించినట్లు వెల్లడించారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



లక్ష్మణరావు మృతదేహం

వీరఘట్టం: కొన్నేళ్లుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వీరఘట్టానికి చెందిన చోడవరపు లక్ష్మణరావు(33) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై జి.కళాధర్ బుధవారం తెలిపారు. ఈనెల 11న లక్ష్మణరావు వీరఘట్టం హైస్కూల్ వెనక ఉన్న మామిడితోటలో అపస్మారక స్థితిలో ఉండడాన్ని గమనించిన కొందరు వ్యక్తులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. ఏం జరిగిందని లక్ష్మణరావును భార్య దేవి ఆరా తీయగా గడ్డి మందు తాగినట్లు చెప్పాడు. వెంటనే వీరఘట్టం పీహెచ్‌సీకి అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు వైద్య చికిత్స కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పామాయిల్ రైతులపై పగ..!

- డ్రిప్ కోసం దరఖాస్తు చేస్తే 7 నెలలైనా కాని మంజూరు
- అధికార పార్టీ నేత చెప్పారని నిలిపివేశారని ఆరోపణలు
- ఎప్పుడు మంజూరు చేస్తారని అడిగితే స్పందించని అధికారులు

విజయనగరం ఫోర్ట్: ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు పొటువు రెడ్డి వెంకటరావు. ఈయనది గంట్యాడ మండలంలోని మధుపాడ గ్రామం. ఐదు ఎకరాల్లో పామాయిల్ సాగు చేశాడు. పామాయిల్ తోటకు నీరు అందించేందుకు డ్రిప్ ఇరిగేషన్ (బిందుసేద్యం) కోసం గత ఏడాది ఆగస్టు నెలలో దరఖాస్తు చేశాడు. ఈ రైతుకు ఇంతవరకు డ్రిప్ మంజూరు చేయలేదు. డ్రిప్ ఎప్పుడు మంజూరు చేస్తారని ఏపీఎంఐపీ అధికారులను అడిగితే ఏమీ చెప్పడం లేదని వాపోతున్నాడు. అధికార పార్టీ నేత చెప్పారని ఈ రైతుకు డ్రిప్ మంజూరు చేయకుండా నిలిపివేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● ఇదే గ్రామానికి చెందిన పొటువు రెడ్డి చినదేముడు కూడా ఐదు ఎకరాల్లో పామాయిల్ సాగు చేశాడు. ఈయన కూడా కూడా గత ఏడాది ఆగస్టు నెలలో డ్రిప్ కోసం దరఖాస్తు చేశాడు. ఈ రైతుకు కూడా అధికారులు డ్రిప్ మంజూరు చేయలేదు. అధికార పార్టీ నేత చెప్పారని ఈయనకు కూడా డ్రిప్ మంజూరు చేయలేదని తెలుస్తోంది. ఇలా వీరిద్దరికే కాదు అనేక మంది రైతులకు ఈ విధంగానే డ్రిప్ మంజూరు చేయకుండా కూటమి నేతలు అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



మధుపాడలో సాగు చేసిన పామాయిల్ తోట

వెలుగు వీఓఏలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్, పాఠశాలల్లో పనిచేసే వాచ్‌మెన్, ఆయాలు, కేజీబీవీల్లో పనిచేసే వాచ్‌మెన్, కుక్‌లపై కూటమి నేతలు ప్రతాపం చూపారు. ఇప్పుడిక రైతులపై కూడా కూటమి నేతలు తమప్రతాపాన్ని చూపుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారికి అందాల్సిన ప్రభుత్వ రాయితీలను అందకుండా కూటమి నేతలు అడ్డుకున్నట్లు విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. కూటమి నేతల ఆదేశాలకు అధికారులు జీహుజుర్ అంటున్నరనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

రైతులతో రాజకీయం

ఏపార్టీతో సంబంధం లేని రైతులతో కూడా అధికార పార్టీ నేతలు రాజకీయం చేయడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ఉద్యాన పంటలు సాగుచేసే రైతులను ప్రోత్సహించడం కోసం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం) అందిస్తారు. రైతుల్లో కూడా అధికార పార్టీ వారా? ప్రతిపక్ష పార్టీ వారా? అని కూటమి నేతలు చూస్తున్నారు. అధికార పార్టీకి చెందిన వారు అయితే ఓకే. ప్రతిప్రక్ష పార్టీకి చెందిన వారికైతే మంజూరు చేయకుండా అడ్డుకుంటున్నారు. ఎవరికి మంజూరు చేయాలో? ఎవరికి చేయకూడదో? జాబితాను కూడా అధికార పార్టీ నాయకులు అధికారులకు ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకున్న తర్వాత అధికారులు నెలల తరబడి మంజూరు చేయకుండా జాప్యం చేయడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం రాయితీపై డ్రిప్ ఇస్తుందని రైతులు పంటలు సాగుచేస్తున్నారు. డ్రిప్ ఇవ్వక పోవడం వల్ల పంటల సాగుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఉద్యాన పంటలను ప్రోత్సహించడం కోసం డ్రిప్‌ను రాయితీపై అందిస్తున్నారు. కానీ కూటమి నేతల తీరు వల్ల రైతులకు డ్రిప్ అందే పరిస్థితి కనిపించడం లేదు.

డ్రిప్‌తో నీటి వృథాకు చెక్

డ్రిప్ ఇరిగేషన్ (బిందుసేద్యం) వల్ల నీటి వృథాను అరికట్టవచ్చు. సాధారణ పద్ధతిలో మొక్కలకు నీరు పెడితే కొంత వృథా అయ్యే అవకాశం ఉంటుంది. కానీ బిందు సేద్యంలో నీటి వృథా ఉండదు. మొక్కకు వేళ్ల వరకు నీరు అందుతుంది. దీనివల్ల మొక్క ఎదుగుదల బాగుంటుంది. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా ప్రతి మొక్కకు పైపులు ఏర్పాటు చేసి నీరు అందిస్తారు. రైతులకు డ్రిప్ మంజూరులో జాప్యం గురించి ఏపీఎంఐపీ (ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు) పీడీ లక్ష్మీనారాయణను ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

విధి నిర్వహణ పట్ల ఎంఎస్‌పీలకు దిశానిర్దేశం చేయాలి

● ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: వివిధ పోలీసు స్టేషన్‌ల పరిధిలో పని చేస్తున్న మహిళా సంరక్షణ పోలీసుల సేవలను క్షేత్రస్థాయిలో వినియోగించుకోవాలని ఎస్పీ వకుల్ జిందల్ పోలీస్ అధికారులను బుధవారం ఆదేశించారు. క్షేత్రస్థాయిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సమస్యలను ఎంఎస్పీల సహకారంతో గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ/వార్డు పరిధిలోకి కొత్తగా వచ్చే వ్యక్తులను గుర్తించాలని, వారు ఏ ప్రాంతం వారు? ఎందుకు, ఎక్కడ నుంచి వచ్చింది ఎంఎస్పీల సహకారంతో తెలుసుకోవాలన్నారు. వారు చెప్పిన కారణాలు నిజమో, కాదో తెలుసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు సైబర్ మోసాలు, మహిళా రక్షణకు అండగా ఉండే చట్టాలు, రహదారి భద్రత, మహిళల భద్రత పట్ల, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, సంకల్పం వంటి కార్యక్రమాల పట్ల ఎంఎస్పీలు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. వారంలో ఒకసారి ఎంఎస్పీలతో సంబంధిత ఎస్‌హెచ్‌ఓలు సమావేశం నిర్వహించి, క్షేత్రస్థాయిలో విషయాలు గురించి అడిగి తెలుసుకోవాలని, ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

హత్య కేసు ఛేదనకు పోలీసుల ముమ్మర దర్యాప్తు



హత్యకు గురైన ప్రసాద్ కుటుంబసభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు

తెర్లాం: మండలంలోని నెమలాం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కోనారి ప్రసాద్ హత్య కేసును ఛేదించేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సోమవారం రాత్రి ప్రసాద్ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసును బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి ఆదేశాల మేరకు రూరల్ సీఐ నారాయణరావు ఆధ్వర్యంలో తెర్లాం, బాడంగి, రామభద్రపురం, బొబ్బిలి ఎస్సైలు సాగర్ బాబు, తారకేశ్వరరావు, ప్రసాద్, రమేష్‌లు దర్యాప్తు చేస్తున్నారు. హత్య జరిగిన రోజున క్లూస్ టీమ్ సేకరించిన ఆధారాలు, హతుని కాల్‌డేటా, ఇతర సమాచారం మేరకు హత్యకు గల కారణాలను తెలుసుకునేందుకు అనుమానితులను విచారణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హతుని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, స్నేహితుల నుంచి అలాగే నెమలాం, విజయరాంపురం(బూరిపేట) గ్రామాల్లో పోలీసులు పర్యటించి వివరాలు సేకరిస్తున్నారు. ప్రసాద్‌ను హత్య చేసేందుకు వివాహేతర సంబంధమే కారణమై ఉండవచ్చని పలువురు చర్చించుకుంటున్నారు. హత్య కేసు దర్యాప్తు విషయమై బుధవారం సాయంత్రం బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రసాద్ హత్య కేసుకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశామని, నిందితులను పట్టుకునేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ప్రతి ఒక్కరూ సమాజానికి ఉపయోగపడాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ చక్రవర్తి

విజయనగరం ఫోర్ట్: ప్రతి ఒక్కరూ సమాజానికి ఉపయోగపడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక దాసన్న పేటలో ఉన్న ఏపీ విద్యుత్ ఉద్యోగుల సంఘం (1104) కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సంఘం ప్లాటినమ్ జూబ్లీ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్నారన్నారు. విద్యుత్ ఉద్యోగులు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. అభాగ్యులు, నిరుపేదలను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ ముప్పల లక్ష్మణరావు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్లతో సంబంధం లేకుండా విద్యుత్ ఉద్యోగుల సంఘం (1104) పనిచేస్తుందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తుందని తెలిపారు. అనంతరం కస్పా పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ కిట్లు, పేదలకు వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఆర్‌ఎస్ ప్రసాద్, సంఘం కార్యదర్శి సురగాల లక్ష్మణ్, ఎస్‌ఏఓ విప్పర్తి రాంబాబు, ఈఈ పెద్దింటి త్రినాథరావు, ఈఈ గున్న సురేష్‌బాబు, ఈఈ కె.వి. లక్ష్మీనారాయణ, డీజీఎం కేవీఏ సత్యనారాయణ, ఈఈ ఎంఆర్‌టి పి.మురళీకృష్ణ, ప్రజాగాయకుడు దేవిశ్రీ మజ్జి తదితరులు పాల్గొన్నారు.

అనధికార మద్యం దుకాణాలపై కేసులు నమోదుచేయండి


● డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఎక్సైజ్ బాబ్జీరావు



ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ బాబ్జీరావు

విజయనగరం టౌన్: అనధికార మద్యం దుకాణాలపై కేసులు నమోదుచేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్.బాబ్జీరావు అధికారులకు సూచించారు. ఈ మేరకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎక్సైజ్ అధికారులతో స్థానిక బ్యాంక్ కాలనీలో ఉన్న డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి నెలలో 133 కేసులు నమోదయ్యాయని, 73 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అలాగే 163 బెల్ట్‌షాపులపై కేసులు నమోదుచేసి 163 మందిని అరెస్టు చేశామని 1246 మందిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. మద్యం బాటిల్స్ ఎమ్మార్పీకి విక్రయించేలా చర్యలు చేపట్టాలి. అనధికార మద్యం దుకాణాలు ఉండరాదు. గ్రామాల్లో బెల్ట్ షాపుల కోసం వేలం పాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి. సారా తయారీ అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేయాలి. ఎన్‌డీపీఎల్ రాకుండా అడ్డుకట్ట వేయాలి. బొడారా చెక్‌పోస్టు గుండా గంజాయి రవాణా ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలి. రెస్టారెంట్స్, బార్స్, మద్యం షాపులన్నీ లైసెన్స్ నిబంధనలు పాటించాలని ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ పి.రామచంద్రరావు, జిల్లా ఎక్సైజ్ అధికారి బమ్మిడి శ్రీనాథుడు, డిపో మేనేజరు గౌరీశ్వరరావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ చక్రతీర్థస్నానం



స్వామివారికి శ్రీచక్రతీర్థ స్నానం చేస్తున్న అర్చకులు



స్వామివారి తిరువీధి

గరుగుబిల్లి: తోటపల్లిలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా శ్రీపద్మావతి, భూదేవి సహిత స్వామివారికి శ్రీచక్రతీర్థ స్నానం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఉదయం సుప్రభాతసేవ, మంగళాశాసనం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కలశారాధన, చూర్ణోత్రతం తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించిన అనంతరం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి నాగావళి నదీ తీరం వరకు స్వామి, అమ్మవార్లకు తిరువీధి నిర్వహించారు. పిమ్మట నాగావళినది తీరంలో చూర్ణంతో అమ్మవార్లు, స్వామివారికి సంప్రోక్షణ తదితర పూజలను నిర్వహించారు. అలాగే పవిత్ర నాగావళినదిలో స్వామివారికి భక్తులు పంచామృతాలు, గంధం, సుగంధద్రవ్యాలతో అభిషేకాలను నిర్వహించారు. స్వామికి విశేష పూజలు చేసిన అనంతరం భక్తులు నాగావళినదిలో పుణ్యస్నానాలను ఆచరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు వీవీ అప్పలాచార్యులు మాట్లాడుతూ లోక శాంతికోసం నదుల్లోని పవిత్ర జలాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించాలని చెప్పారు. స్వామివారికి కల్యాణం, అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులు నదుల్లో స్నానమాచరిస్తే వెయ్యినదుల్లో స్నానం చేసిన పుణ్యం సిద్ధిస్తుందన్నారు. భక్తులకు ఉచితంగా ప్రసాదాన్ని అందించారు. శ్రీచక్రతీర్థ స్నానం కార్యక్రమంలో ఈఓ వీవీ సూర్యనారాయణ, టెంపుల్ ట్రస్టు బోర్డు సభ్యులు ద్వారపురెడ్డి ధనుంజయరావు, శ్రీరామూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీల అదాయం లెక్కింపు

తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, కోదండ రామస్వామి ఆలయాలకు సంబంధించి గురువారం హుండీల అదాయం లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ వీవీ. సూర్యనారాయణ బుధవారం తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో హుండీల ఆదాయం లెక్కింపు జరుగుతుందన్నారు. ఆసక్తిగల భక్తులు, దాతలు, సేవల లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనే వారు తెల్లని పంచె, తెల్లని బనియన్‌ను మాత్రమే ధరించి పాల్గొనాలని సూచించారు.

ఐసీడబ్ల్యూఏఐలో 'కీర్తి'



కీర్తి ప్రియను అభినందిస్తున్న గురువులు

విజయనగరం అర్బన్: కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంట్స్ (ఐసీడబ్ల్యూఏఐ) ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో పట్టణానికి చెందిన ఎస్.కీర్తి ప్రియ జాతీయ స్థాయిలో 45వ ర్యాంక్ సాధించారు. ఆమెను ఆర్‌ఎస్ అకాడమీ డైరెక్టర్ రమేష్‌తో పాటు తల్లిదండ్రులు, అధ్యాపకులు అభినందించారు.

పోలమాంబ జాతర ఆదాయం లెక్కింపు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి మూడవజాతర ఆదాయాన్ని ఈవో వీవీ సూర్యనారాయణ సమక్షంలో బుధవారం లెక్కించారు. శీఘ్రదర్శనం టిక్కెట్ల ద్వారా రూ.3,61,700, ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.1,05,000, కేశ ఖండన టికెట్ల ద్వారా రూ.14,600, మహాన్న దాన విరాళాల ద్వారా రూ.1, 82,307, లడ్డు ప్రసాదం ద్వారా రూ.1,29,420, పులిహోర ప్రసాదం ద్వారా రూ.86,760 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. మూడవ జాతరలో మొత్తం రూ.8,79,807 ఆదాయం సమకూరింది. లెక్కింపు కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడిపై లైంగిక దాడి కేసు నమోదు

బాడంగి: బాలికను ప్రేమపేరుతో వలలో వేసుకుని ఆమెను ఇంటినుంచి రప్పించి తల్లిదండ్రులకు దూరంగా తెలియని ప్రాంతానికి తీసుకుపోయి లైంగికదాడికి పాల్పడి మోసగించిన యువకుడిపై పోలీసులు పోక్సోకేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి బాధిత బాలిక తండ్రి, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాడంగి మండలంలోని వాడాడ గ్రామానికి చెందిన వాడాడ వెంకటరమణ (23) డిసెంబర్ నెలలో ప్రేమించినట్లు నటించి బాలికను వలలోవేసుకుని అదేనెల 27వ తేదీన వెంట తీసుకుపోయాడు. దీనిపై బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. అప్పటినుంచి వారికోసం 45 రోజులకు పైగా పోలీసులు గాలించగా తూర్పుగోదావరి జిల్లా కత్తిపూడిలో ఉన్నట్లు సమాచారం తెలుసుకుని బొబ్బిలి పోలీస్‌స్టేషన్‌కు రప్పించారు. డీఎస్పీ భవ్యరెడ్డి కేసునమోదుచేసి బుధవారం గ్రామానికి వెళ్లి పరిస్థితిపై ఆరాతీశారు. బాలికకు స్థానిక ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించి లైంగిక దాడి జరిగినట్టు నిర్ధారించిన తరువాత నిందితుడు వెంకటరమణను అరెస్టు చేసి బొబ్బిలి కోర్టుకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉందని డీఎస్పీ చెప్పారు.

154.6 కేజీల గంజాయి స్వాధీనం



గంజాయి కేసుకు సంబంధించి వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అంకిత్ సురానా

పాచిపెంట: స్విఫ్ట్ డిజైర్ కారులో అక్రమంగా తరలిస్తున్న 154.6 కేజీల గంజాయిని పాచిపెంట పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పార్వతీపురం ఏఎస్పీ అంకిత్ సురానా పాచిపెంట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మండలంలోని మాతుమూరు సమీపంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న హరిత రహదారిపై నుంచి స్విఫ్ట్ డిజైర్ కారులో అక్రమంగా గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం అందింది. ఈ మేరకు సాలురూ రూరల్ సీఐ రామకృష్ణ పాచిపెంట ఎస్సై వెంకట సురేష్ పోలీస్ సిబ్బందితో కలిసి గ్రామ సమీపంలో హరిత రహదారిపై ఆగి ఉన్న స్విఫ్ట్ డిజైర్ కారును పరిశీలించగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించి 154.6 కేజీల గంజాయితో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పి.కోనవలస చెక్‌పోస్టును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఘాట్ రోడ్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు రహదారి మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, సీఐ, ఎస్సైలకు సూచించారు. అలాగే ఈనెల 26వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా పారమ్మ కొండ వద్ద జరిగే జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఏఎస్పీ వెంట సాలూరు పట్టణ, రూరల్ సీఐలు అప్పలనాయుడు, రామకృష్ణలు ఉన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన విద్యార్థులు



సిద్ధార్థ నాయుడిని అభినందిస్తున్న తల్లిదండ్రులు

మెరకముడిదాం: మండలంలోని ఎం.రావివలస గ్రామానికి చెందిన పిన్నింటి సిద్ధార్థ నాయుడు మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో 97.30 శాతం మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థి సిద్ధార్థనాయుడిని తల్లిదండ్రులు, మాజీసర్పంచ్ పిన్నింటి సుగుణాకరరావు, పిన్నింటిహిరణ్మయితో పాటు పలువురు గ్రామస్తులు అభినందించారు. అలాగే కొత్తకర్ర గ్రామానికి చెందిన బూర్లె గగన్ 86.04 శాతం మార్కులను సాధించాడు. గగన్‌ను తల్లిదండ్రులు, మాజీ సర్పంచ్ బూర్లె నరేష్‌కుమార్, బూర్లెరాధలతో పాటు గ్రామస్తులు అభినందించారు.

యోగేశ్వర్ ప్రతిభ



యోగేశ్వర్

రామభద్రపురం: మండలంలోని ఆరికతోటకు చెందిన విద్యార్థి జాగాన యోగేశ్వర్ జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో 300 మార్కులకు 257 మార్కులతో 99.87పర్సంటైల్ సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పేరు తీసుకువచ్చాడు. తండ్రి సింహాచలం ఓ ప్రైవేట్ స్కూల్ అధ్యాపకుడు కాగా తల్లి యర్రయ్యమ్మ గృహిణి, యోగేశ్వర్ సాధించిన విజయానికి అందరూ అభినందిస్తున్నారు.

జేకేగుమ్మడ విద్యార్థి ప్రతిభ



కొల్లి చరణ్

వంగర: మండల పరిధి జేకే గుమ్మడ గ్రామానికి చెందిన కొల్లి చరణ్ ప్రతిభ కనబరిచాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో 97.89 పర్సంటైల్ సాధించాడు. నిరుపేద కుటుంబంలో పుట్టిన చరణ్ జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటడంతో తల్లిదండ్రులు కొల్లి తిరుపతి, గీత, మాజీ సర్పంచ్ మరిశర్ల విజయలక్ష్మి, గ్రామపెద్ద మరిశర్ల గంగారావు, పలువురు గ్రామస్తులు అభినందించారు.

సాలూరు విద్యార్థి ప్రతిభ



విద్యార్థి తల్లిదండ్రులకు అభినందనలు తెలుపుతున్న కళాశాల యాజమాన్యం

సాలూరు: జేఈఈ మెయిన్స్ జనవరి 2025 ఫలితాల్లో సాలూరుకు చెందిన విద్యార్థి రౌతు షణ్ముఖేశ్వరరావు ఆలిండియాలో ప్రతిభ కనబరిచాడు. విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న షణ్ముఖేశ్వరరావు జేఈఈ మెయిన్స్‌లో 99.68 శాతం మార్కులు సాధించాడు. ప్రతిభభ కనబర్చిన విద్యార్థికి, పట్టణంలో ఉన్న ఆయన తల్లిదండ్రులకు కాలేజీ యాజమాన్యం ప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపారు.

చెరువుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలి

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో చెరువుల పునరుద్ధరణకు జలవనరుల శాఖ చర్యలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జలవనరుల శాఖ, జీవనోపాధుల శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జలవనరుల లభ్యత అధికంగా ఉందన్నారు. వాటిని సరైన రీతిలో పరిరక్షించుకోవడం వల్ల జలవనరులు పెరిగి, అత్యంత ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. దాదాపు 187 చెరువులు వంద ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగి ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగించడం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు అవకాశం ఉందన్నారు. ప్రతి చెరువుకు జీపీఎస్ వ్యవస్థను ఉపయోగించి మ్యాపింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉన్న 2,915 చెరువులను పక్కాగా పరిరక్షించుకోవాలని, ఆక్రమణలు జరగకుండా చుట్టూ ట్రెంచ్‌లు కొట్టాలని సూచించారు. ఖరీఫ్‌లో 2.78 లక్షల ఎకరాల్లో, రబీలో 36 వేల ఎకరాల్లో పంటలు వేస్తున్నారని దానిని రెట్టింపు చేయాలని స్పష్టం చేశారు. ఆస్తుల రక్షణకు వివిధ ప్రాజెక్టులతో ముందుకు రావాలని ఆయన ఆదేశించారు.

కుటుంబాల ఆదాయం పెరగాలి

జిల్లాలో కుటుంబాల ఆదాయం పెరగాలలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. వన్‌ధన్ వికాస్ కేంద్రాలు, నైపుణ్య అభివృద్ధి శిక్షణ, ఇతర శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు బలోపేతం చేయాలని సూచించారు. మండలాల వారీగా జాబ్‌మేళాలు నిర్వహించాలని చెప్పారు. విశ్వకర్మ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. వీడీవీకేలు క్లస్టర్ వారీగా ఏర్పడి సంబంధిత ఉత్పత్తులు పెంచాలని కోరారు. సమావేశంలో పార్వతీపురం సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్ర రావు, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ సుధాకరరావు, కార్యనిర్వహణ ఇంజినీర్ ఆర్.అప్పల నాయుడు, , డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై. సత్యం నాయుడు, సీతంపేట గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి అన్నాదొర, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవీ కరుణాకర్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె సాయి కృష్ణ చైతన్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎస్.విజయ స్వరూప్, ఐటీడీఏ ఏపీఓలు జి. చినబాబు, ఎ.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.